నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I | హైదరాబాద్, సోమవారం 22 ఏప్రిల్ 2024 | RANGAREDDY

## ఎర్లీబర్డ్‌కు స్పందన నామమాత్రమే !

- రూ.800కోట్ల లక్ష్యంలో వసూలైంది కేవలం రూ.356 కోట్లు మాత్రమే
- మరో 9 రోజుల్లో నిర్దేశిత టార్గెట్ అధిగమించడం కష్టమే

సిటీబ్యూరో, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ) : ముందుస్తుగా ఆస్తిపన్ను చెల్లిస్తూ 5 శాతం రాయితీ పొందాలన్న జీహెచ్ఎంసీ పిలుపునకు వినియోగదారులు పెద్దగా స్పందించడం లేదు. ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు జీహెచ్ఎంసీ 'ఎర్లీబర్డ్' స్కీంను ప్రవేశపెట్టింది. 30 సర్కిళ్ల పరిధిలో రూ. 800కోట్ల మేర వసూళ్లను రాబట్టాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నది. గడిచిన 21 రోజుల వ్యవధిలో కేవలం రూ. 356 కోట్ల మేర ఎర్లీబర్డ్ కింద ఆదాయాన్ని సమకూర్చుకున్నది. మరో 9 రోజుల్లో నిర్దేశిత లక్ష్యాన్ని చేరడం కష్టంగానే మారింది. దీనికి కారణం కమిషనర్ మొదలు ఉన్నతాధికారుల వరకు ఎన్నికల విధుల్లో ఉండడం.. అధికారులపై పర్యవేక్షణ లేకపోవడం.. ప్రజలకు అవగాహన కల్పించకపోవడమేనని అంటున్నారు. కానీ ఈసారి అవగాహన కల్పనలో అధికారులు ఫెయిల్ అయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అన్ని జోన్ల కంటే ఖైరతాబాద్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి జోన్ల నుంచి ఎర్లీబర్డ్ స్కీంకు ఆశించిన స్పందన రాలేదని సమాచారం.




- 'సీ' విజిల్‌కు విశేష స్పందన
- జిల్లాలో ఇప్పటివరకు ప్రజల నుంచి 80 వరకు ఫిర్యాదులు
- రానున్న రోజుల్లో వెల్లువెత్తనున్న ఫిర్యాదులు
- నామినేషన్ నుంచే అభ్యర్థి ఎన్నికల వ్యయంపై నిఘా
- చేవెళ్ల లోక్‌సభకు వ్యయ పరిశీలకులను నియమించిన ఎన్నికల సంఘం

# 'పౌర' అస్త్రం


లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు పాల్పడుతున్నాయి. ఇందులో ప్రధానంగా ఓటర్లను ఆకట్టుకునేందుకు నేతలు తాయిలాలు పంచి ప్రలోభాలకు గురిచేయడం వంటి చర్యలకు పూనుకుంటున్నారు. ఇటువంటి చట్ట వ్యతిరేక చర్యలను అరికట్టేందుకు కేంద్రఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చిన 'సీ' విజిల్‌కు ప్రజల నుంచి విశేష స్పందన వస్తున్నది. ఎన్నికల నియమావళికి వ్యతిరేకంగా అన్ని రకాల ఘటనలపై యాప్ ద్వారా ప్రజలు నేరుగా ఫిర్యాదు చేసే అవకాశం ఉండడంతో జిల్లాలో చాలా మంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

- రంగారెడ్డి, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ)

### ప్రచార వ్యయంపై నిఘా..

జిల్లాలో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఎన్నికల ప్రచారంపై నిఘా మొదలైంది. నామినేషన్ల పర్వం నుంచే ఈ ప్రక్రియ మొదలుకానుండగా.. సంబంధిత అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారు. చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం వ్యయ పరిశీలకులుగా ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్‌కు సంబంధించిన అధికారులు సెంథిల్ కుమారన్, రాజీవ్ చావ్రాలను నియమించింది. ఇప్పటికే వీరు ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, ఎంసీసీ, అకౌంటింగ్ టీం సభ్యులతో సమావేశాన్ని నిర్వహించి ఎన్నికల్లో నిర్వర్తించాల్సిన బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. గత ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చు రూ.70లక్షలు ఉండగా.. ప్రస్తుత ఎన్నికల్లో రూ.90 లక్షలకు మించి ఖర్చు చేయరాదని ఎన్నికల సంఘం నిర్దేశించింది. అభ్యర్థులు నిర్వహించే ర్యాలీలు, సభలు, సమావేశాలు, భోజనాలు, వాహనాలు, ఎన్నికల సామగ్రికి సంబంధించిన అన్ని ఖర్చులను నిఘా బృందాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నాయి.

### ఇప్పటివరకు 80 ఫిర్యాదులు..



లోక్ సభ ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు సంబంధించి ఈ నెల 19 వరకు 'సీ' విజిల్ యాప్ ద్వారా 80 ఫిర్యాదులు వచ్చాయి. కోడ్ అమల్లోకి వచ్చిన మార్చి 16 నుంచే ఈ యాప్‌ను చాలామంది ఉపయోగించుకోవడం విశేషం. అత్యధికంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచే 33 వరకు ఫిర్యాదులు అధికారులకు అందాయి. అనుమతి లేకుండా పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేయడం వంటి ఘటనలకు సంబంధించి ఎక్కువ ఫిర్యాదులు రాగా.. డబ్బుల పంపిణీ, అనుమతి లేకుండా ప్రచారంలో వాహనాల వినియోగం తదితర వాటికి సంబంధించి కూడా ప్రజలు ఫిర్యాదులు చేశారు. ఈ మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్, రిజర్వ్ బృందాలు రంగంలోకి దిగి వివరాలు సేకరించి రిటర్నింగ్ అధికారికి నివేదించాయి. ఇలా.. ఫిర్యాదు చేసిన వంద నిమిషాల్లోనే అన్ని ఫిర్యాదులను పరిష్కరించినట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

**నియోజకవర్గాల వారీగా ఫిర్యాదులు ఇలా..**

| నియోజకవర్గం | ఫిర్యాదులు |
|---|---|
| ఇబ్రహీంపట్నం | 07 |
| ఎల్బీ నగర్ | 19 |
| మహేశ్వరం | 11 |
| రాజేంద్రనగర్ | 04 |
| శేరిలింగంపల్లి | 33 |
| చేవెళ్ల | 02 |
| కల్వకుర్తి | 04 |
| షాద్ నగర్ | 0 |
| మొత్తం | 80 |



కేశంపేట మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్ తదితరులు

- గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ శ్రేణులు పని చేయాలి
- మాజీ సీఎం కేసీఆర్ సంక్షేమ పాలన తీరును వివరించండి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థ పాలన తీరును ప్రజలకు చెప్పాలి
- కేశంపేట మండల కార్యకర్తల సమావేశంలో ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

# కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మడం లేదు

షాద్‌నగర్, ఏప్రిల్ 21 : కాంగ్రెస్, బీజేపీలను తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్‌లు అన్నారు. ఆదివారం కేశంపేట మండల కేంద్రంలో నిర్వహించిన మండలస్థాయి సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు హామీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. ఓ వైపు రాష్ట్రంలో కరువు తాండవిస్తున్నా... ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోవడం లేదని, తాగునీరు దొరుకని పరిస్థితి నెలకొన్నదన్నారు. రైతుబంధు, రైతు రుణమాఫీ, మహిళలకు రూ.2500 నగదు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు ఎక్కడ అమలవుతున్నాయని ప్రశ్నించారు. మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఎంపీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. కేంద్రంలో పదేండ్ల పాటు అధికారంలో ఉన్న బీజేపీ పాలమూరు జిల్లాకు కనీస నిధులు ఇవ్వలేదని ఆరోపించారు. మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతూ రాజకీయాలకు పాల్పడుతున్న బీజేపీని తరిమికొట్టాలన్నారు. కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణ ప్రజలను నిండాముంచేందుకు కుట్ర పన్నుతున్నాయని అన్నారు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉద్యమ పోరాట ఫలితంగా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకొని, పదేండ్ల పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుంటున్న సమయంలో కాంగ్రెస్ పార్టీ మరోమారు ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని, అప్పటి సంక్షేమ పథకాల ఫలాలను ప్రజలకు వివరించాలన్నారు. కేశంపేట మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పోమాలపల్లి గ్రామంలో భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సమావేశంలో కేశంపేట ఎంపీపీ వై. రవీందర్‌యాదవ్, మాజీ ఎంపీపీ విశ్వనాథం, బీఆర్ఎస్ నాయకులు జగదీశ్వర్, రాంబల్‌నాయక్, వంకాయల నారాయణరెడ్డి, రాజ్యలక్ష్మి, పల్లె నర్సింగరావు, శేఖర్‌పంతులు, వెంకట్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, శ్రీశైలం, మల్లేశ్, నవీన్‌కుమార్, జమాల్‌ఖాన్, జనార్దన్‌రెడ్డి, అంజిరెడ్డి, మల్లేశ్ యాదవ్, నారాయణరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేశంపేట మండలం పోమాలపల్లి గ్రామంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- దోర్నకల్ టు గద్వాల్ నూతన రైల్వేలైన్‌కు గ్రీన్‌సిగ్నల్
- సర్వే చేపడుతున్న సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు
- పలు గ్రామాల్లో ఎస్‌సీపీ మార్కింగ్‌తో హద్దుల ఏర్పాటు
- నెరవేరనున్న మండల ప్రజల కల.. సర్వత్రా హర్షం

# యాచారం మీదుగా రైల్వేలైన్

యాచారం, ఏప్రిల్ 21 : మండలంలో తొలిసారిగా రైలు కూత వినబడనుందా అనే ప్రశ్నకు అవుననే సమాధానం వినిపిస్తున్నది. ఏన్నో ఏండ్ల స్థానికుల ఎదురు చూపులకు త్వరలోనే తెర పడనున్నది. డోర్నకల్-గద్వాల నూతన రైలు మార్గం నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారు. త్వరలో మండలంలోని పలు గ్రామాల మీదుగా కొత్త రైల్వేలైన్ నిర్మించనున్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే (ఎస్‌సీఆర్) అధికారులు ఇప్పటికే ప్రాథమిక సర్వే చేపట్టారు. యాచారం మండలంలోని తక్కళ్లపల్లి, మేడిపల్లి గ్రామాల్లో సర్వే చేసి ఎస్‌సీపీ నంబర్లతో కూడిన మార్కింగ్‌లు వేయడంతోపాటు రైలుమార్గం ఏర్పాటుకు హద్దులు ఏర్పాటు చేశారు. పక్కనే ఉన్న కందుకూరు మండలంలోనూ అధికారులు సర్వే చేసినట్లు సమాచారం. నూతన రైల్వేలైన్‌పై కొంత మంది హర్షం వ్యక్తం చేస్తుండగా.. మరికొంత మంది రైతులు తమ భూములు కోల్పోతామేమోనని ఆందోళన చెందుతున్నారు.

### 11 స్టేషన్లు.. 296 కిలోమీటర్లు..

మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నుంచి రంగారెడ్డి, ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ, నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాలను కలుపుతూ జోగులాంబ గద్వాల వరకు ఈ రైలు మార్గాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. దీనికోసం గతేడాదే రైల్వేలైన్ మంజూరుకు సీఎస్ఆర్ ప్రతిపాదించింది. ఈ రైల్వేలైన్ మార్గానికి సంబంధించిన తుది సర్వే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వచ్చే ఏడాది ఈ రైలుమార్గం ప్రాజెక్టు పట్టాలెక్కనున్నట్లు సమాచారం. డోర్నకల్ టు గద్వాల మధ్య సుమారు 11స్టేషన్లను కలుపుతూ 296 కిలో మీటర్ల రైలు మార్గాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రూ.5,300 కోట్లను వెచ్చించనున్నట్లు సమాచారం. ఇప్పటికే రూ.7.40 కోట్లు మంజూరు చేసినట్లు తెలిసింది. డోర్నకల్ నుంచి రంగారెడ్డి జిల్లాతో పాటుగా కూసుమంచి, పాలేరు, మోతే, సూర్యాపేట, బీమారం, నల్లగొండ, నాంపల్లి, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, వనపర్తి, బూత్పూర్ వంటి ప్రధాన ప్రాంతాలను కలుపుతూ రైల్వేలైన్‌ను నిర్మించనున్నారు. యాచారం మండలంలోని నానక్‌నగర్, మేడిపల్లి, తక్కళ్లపల్లి, మాల్‌తోపాటు చింతపల్లి, నాంపల్లి, చండూర్, కనగల్, నల్లగొండ, కేతేపల్లి, చివ్వెంల, పాలేరు, మోతె, సూర్యాపేట తదితర గ్రామీణ ప్రాంతాలను కలుపుతూ రైలు మార్గం నిర్మించనున్నారు. మేడిపల్లి-తక్కళ్లపల్లిలో ఎస్‌సీపీ 93, చింతపల్లిలో 54, మోతేలో ఎస్‌సీపీ 103 నంబర్లను అధికారులు మార్కింగ్ చేశారు.

### మరింత అభివృద్ధి..

నూతన రైల్వేమార్గంతో రవాణా సౌకర్యం మెరుగుపడి యాచారం మండలం మరింత అభివృద్ధి చెందనున్నది. వాణిజ్య రంగం, రియల్ ఎస్టేట్ వ్యాపారం మరింతగా విస్తరించనున్నది. మండలానికి శంషాబాద్ ఎయిర్‌పోర్టు కూతవేటు దూరంలో ఉండటం, మండలంలోని కుర్మిద్ద, తాటిపర్తి, నానక్‌నగర్, మేడిపల్లి గ్రామాల పక్కనే ఫార్మాసిటీ విస్తరించి ఉండటంతో ఇక్కడి నుంచి రైలుమార్గాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. దగ్గరలోనే ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రం కూడా ఉండడం కూడా ఓ కారణంగా చెప్పవచ్చు. పైగా అటు శ్రీశైలం హైవేతో పాటుగా ఇటు నాగార్జున సాగర్ ప్రధాన రహదారిని కలుపుతూ రైలుమార్గం వెళ్లనున్నది. వివిధ జిల్లాలను కలుపుతూ ఈ రైల్వేలైన్ ఏర్పాటు చేస్తుండడంతో ప్రయాణికులు, వ్యాపారులు తక్కువ సమయంలో ఎక్కువ దూరం ప్రయాణించే వీలుంటుంది.

### స్థానికుల హర్షం..

గతంలో హైదరాబాద్ నుంచి సాగర్ మీదుగా మాచర్లకు రైల్వేలైన్ వేస్తామని అప్పటి కాంగ్రెస్ కేంద్ర మంత్రి హామీ ఇచ్చినప్పటికీ నెరవేర్చలేకపోయారు. దీంతో రైలు ఎక్కాలనే ఈ ప్రాంత ప్రజల కల కలగానే మిగిలింది. ప్రస్తుతం డోర్నకల్-గద్వాల రైల్వేలైన్‌కు మార్గం సుగమం కావడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



డోర్నకల్-గద్వాల రైలుమార్గం కోసం సర్వే చేస్తున్న సిబ్బంది

### సర్వే చేయడం సంతోషంగా ఉన్నది..



మేడిపల్లి నక్కర్త మీదుగా రైల్వేలైన్ ఏర్పాటు కోసం సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు సర్వే చేయడం సంతోషంగా ఉన్నది. ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది. దూర ప్రాంత ప్రయాణాలు సులభతరం కావడంతో పాటు, సమయం, ఖర్చు ఆదా అవుతుంది. అధికారులు డోర్నకల్-గద్వాల రైలు మార్గాన్ని వీలైనంత త్వరగా నిర్మించి రైలును పట్టాలెక్కించాలి.

-కలకొండ అంజయ్య, వ్యాపారి (మేడిపల్లి నక్కర్త)



పంట నష్టపోయిన రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

# రైతన్న కష్టం నేలపాలు

## వడగండ్ల వాన, ఈదురుగాలులతో పంటలకు నష్టం

పరిగి, ఏప్రిల్ 21 : శనివారం సాయంత్రం వడగండ్ల వాన, ఈదురుగాలులతో పరిగి మండలం ఇబ్రహీంపూర్, ఇబ్రహీంపూర్ పెద్ద తండా పరిధిలో మొక్కజొన్న, వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మామిడికాయలు సైతం నేల రాలాయి. ఈ రెండు గ్రామాల పరిధిలో 100 ఎకరాల వరకు పంటలకు నష్టం వాటిల్లి ఉంటుందని రైతులు తెలిపారు. దీంతో తాము కోలుకునే పరిస్థితి లేదని.. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం మండల వ్యవసాయాధికారి ప్రభాకర్‌రెడ్డి వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.

### ఎకరాకు రూ.25వేల పరిహారం అందించాలి

**- మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి**

వడగండ్ల వర్షానికి తీవ్రంగా పంటలను నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.25వేలు సహాయం అందించాలని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఇబ్రహీంపూర్, ఇబ్రహీంపూర్ పెద్దతండాల్లో వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి నుంచే జిల్లా వ్యవసాయాధికారితో ఫోన్‌లో మాట్లాడి వడగండ్ల వర్షానికి పెద్ద ఎత్తున పంటలకు నష్టం జరిగిందని, వెంటనే నష్టపోయిన పంటలను అంచనా వేయించి ప్రభుత్వానికి నివేదిక పంపించాలని సూచించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించినవారిలో పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మాజీ సర్పంచ్ అశోక్‌వర్ధన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



నేలకొరిగిన మొక్కజొన్న పంట



వడగండ్ల వానకు నేలవాలిన వరి పంట